కదం తొక్కిన జగనన్న సైన్యం


ప్రజలకు అభివాదం చేస్తున్న వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, నాయకులు

- ఊరూరా రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- వైఎస్సార్‌కు నివాళులర్పించిన నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తరలి వచ్చింది. గురువారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్‌తో కరచాలనం, సెల్ఫీలు తీసుకునేందుకు యువత తమ మోటారు బైక్‌లపై ఉత్సాహంగా వచ్చారు. తాటిపర్తి క్యాంప్ కార్యాలయం వద్దకు చేరిన వారంతా వైఎస్సార్ సీపీ జెండాలను పట్టుకొని బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి చంద్రశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వైష్ణవి గార్డెన్స్ వరకు వారంతా పచ్చ నాయకులకు దడ పుట్టే విధంగా ఒక ప్రవాహంగా బయల్దేరి వెళ్లారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలో వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. అక్కడికి చేరిన కార్యకర్తలను ఉద్దేశించి తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ సామాన్యులను అసామాన్యులను చేసే పార్టీ వైఎస్సార్ సీపీ అని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తుంచుకొని వారికి న్యాయం చేస్తామని ఆయన అనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెంలో 100 పడకల వైద్యశాలను ఏర్పాటు చేయడంతో పాటు పెద్దదోర్నాల మండలంలోని తిమ్మపురంలో గిరిజన సూపర్ స్పెషాల్టీ వైద్యశాల నిర్మాణానికి రూ 50 కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభింప చేశారని పేర్కొన్నారు. పట్టణంలో ఏఎంసీ కార్యాలయం, రైతు బజార్, టీటీడీ కల్యాణ మండపం, ఆర్టీసీ బస్టాండ్‌లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంత్రి ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడ్డారని కొనియాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటానని, రోడ్లు, డ్రైనేజీ, అవసరం ఉన్న ప్రాంతాల్లో డీప్‌వెల్ బోర్లు వేయిస్తానని పేర్కొన్నారు. త్వరలో వెలిగొండ ప్రాజెక్ట్ నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుందని, దీనివలన భూగర్భ జలాలు మెండుగా పెరగడమే కాకుండా ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని చెప్పారు. పుల్లలచెరువు మండలానికి మంజూరైన తీగలేరు కాలువ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి కార్యకర్తలను ఆయన పలకరించారు. చంద్రశేఖర్‌కు నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.


ప్రవాహంలా దూసుకెళ్తున్న జగనన్న సైన్యం

రూ.3 వేల పింఛను జగనన్న ఘనతే..


వేములకోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, జంకె వెంకటరెడ్డి


మార్కాపురంలో పింఛను అందజేస్తున్న వలంటీర్

మార్కాపురం రూరల్: ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ పింఛను కానుకను రూ.2 వేల నుంచి పెంచుకుంటూ రూ.3 వేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేములకోట సచివాలయం వద్ద పలువురు లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 3 వేల రూపాయల పింఛన్‌ను లబ్ధిదారులకు ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీపీ పి.అరుణా చెంచిరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, ఏఓ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పంచాయితీ సెక్రటరీ రేవతి, తిప్పాయిపాలెం మెడికల్ ఆఫీసర్ రోహిత్‌నాయక్ తదితరులు ఉన్నారు.


వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

మార్కాపురంలో 80 శాతం పింఛన్లు పంపిణీ

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్లు గురువారం ఉదయం నుంచే లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఇతర పింఛన్లు కలిపి పట్టణంలో సుమారు 6,290 లబ్ధిదారులు ఉండగా, సుమారు 80 శాతం మందికి నగదు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు.

కొనకనమిట్ల: మండలంలోని వింజవర్తిపాడులో పొలాల్లో ఉన్న లబ్ధిదారులకు వలంటీర్ బ్రహ్మారెడ్డి పింఛన్ నగదు అందజేశారు. పనులకు వెళ్లే కూలీలు, అనారోగ్యంతో మంచం పట్టిన వారికి వేకువజామునే పింఛను అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు.


పుల్లలచెరువు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ లక్ష్మి

వేకువ జామునే పింఛన్ పంపిణీ

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం అందజేసే వైఎస్సార్ ఆసరా పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వేకువ జామునే మొదలైందని ఎంపీడీవో మరియదాసు తెలిపారు. మండలంలో మొత్తం సుమారు 7,850 మందికి పింఛన్ అందచేయాల్సి ఉండగా మొదటి రోజు 85 శాతం పంపిణీ చేపట్టినట్లు చెప్పారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. గురువారం ఆమె మండలంలోని సుద్దకురవ తండా పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు.

నేడు స్వామి వివేకానంద జయంతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరం ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు రామకృష్ణ భక్త బృందం కార్యదర్శి పి.హనుమంతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్లుపల్లె శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాశిరెడ్డి తెలిపారు.

13 మందికి కంటి శస్త్ర చికిత్సలు

పెద్దదోర్నాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు నిర్ధారించారు. రోగులను గుంటూరు జిల్లా పెదకాకాని శంకరా కంటి వైద్యశాలకు తరలించారు. శస్త్ర చికిత్స చేయడంతో పాటు వారికి అవసరమైన కళ్లజోళ్లను సైతం అందజేయనున్నట్లు అప్తమాలిక్ అసిస్టెంట్ కవిత పేర్కొన్నారు. డాక్టర్ మెర్సీ ప్రియాంక, ఆరోగ్యమిత్ర మందగిరి చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశ వర్కర్ మేరమ్మ, కాశింబీ పాల్గొన్నారు.

రేపు ధ్యాన శిక్షణ

కొమరోలు: స్థానిక రాజుగారికోటలో ఉన్న శివసాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో 3వ తేదీన ఉచిత ధ్యాన శిక్షణ, ధ్యానబోధ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పిరమిడ్ ధ్యానమందిర నిర్వాహకులు పొట్టి సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ధ్యానశిక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి సీనియర్ పిరమిడ్ మాస్టర్ సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ధ్యానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

3,4 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

పెద్దదోర్నాల: అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ మహాసభలు ఈ నెల 3,4 తేదీల్లో జరుగుతాయని ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

మార్కాపురం డీఎస్పీగా బాలసుందర్‌రావు

మార్కాపురం టౌన్: మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.బాలసుందరరావు నియమితులయ్యారు. పట్టణ ఎస్సైగా అబ్దుల్ రెహమాన్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కోటేశ్వరరావును బాపట్లకు బదిలీ చేశారు.

నేడు ముండ్లమూరు సర్వసభ్య సమావేశం

ముండ్లమూరు: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరావు తెలిపారు. మండలంలోని మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లా ప్రాదేశిక సభ్యులు, సర్పంచిలు సమావేశంలో హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు తగిన జవాబు ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్ ఆసరాను జయప్రదం చేయండి

కురిచేడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం జరిగే వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. గురువారం ఆయన స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు హాజరవుతున్నారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, కురిచేడు సొసైటీ మాజీ ప్రెసిడెంట్లు మేరువ పిచ్చిరెడ్డి, గోగులముడి లింగారెడ్డి, మాజీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎస్వీ నాగిరెడ్డి, నాయకులు ఏపీ సాంబయ్య, నారు శ్రీనివాసుల రెడ్డి, నుసుం సుబ్బారెడ్డి, బొరిగర్ల గోవిందు, పోకూరి సుబ్బారావు, నర్సింహారెడ్డి, సోమురాజు, రత్నం, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీఎం సైమన్ పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీపాతాళనాగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు, చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్యలు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

687 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

యర్రగొండపాలెం: స్థానిక హాస్టల్స్‌లో ఉన్న 687 మంది విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.కోటానాయక్, షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో సిబ్బంది సికిల్‌సెల్ (రక్తహీనత) పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాల హాస్టల్‌లో 350 మందికి, మినీ గురుకుల పాఠశాల హాస్టల్‌లో 105 మందికి, కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌లో 232 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆయా వైద్య పరీక్షల్లో పీహెచ్‌సీ సిబ్బంది శంకర్‌నాయక్, శివనాగమణి, ఆవులయ్య, ప్రమీల, నాగలక్ష్మి, కుమారి, రమ్యమానస, పద్మావతి, రహిమున్నీసా, లక్ష్మీబాయి, రేణుక, స్వప్న, స్వర్ణలత, వెంకటరమణ, జయ, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కులగణన సర్వే పరిశీలన


కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ప్రక్రియను ఎంపీడీఓ తోట చందన గురువారం పరిశీలించారు. పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె.. సర్వే పారదర్శకంగా నిర్వహించారా లేదా అని ప్రజల వద్ద ఆరా తీశారు. పంచాయతీ సెక్రటరీ నారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు వెంట ఉన్నారు.

140 వసంతాల సంబరాలు

బేస్తవారిపేట: స్థానిక సబ్ పోస్టాఫీసులో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 140 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎల్‌ఐ రూ.లక్ష నుంచి 50 లక్షల వరకు చేసుకోవచ్చని, తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్, సబ్ పోస్టాఫీసుల్లో ఎక్కడైనా ప్రీమియం చెల్లించుకోవచ్చని, ఇన్‌కంట్యాక్స్ రిబేట్ ఉంటుందని తెలిపారు. విద్యుత్‌శాఖ ఏడీ బాలఅంకయ్య, బీపీఎంలు, ఎబీఎంపీలు, సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు

ఉల్లగల్లులో ఇంటింటి సర్వే

ముండ్లమూరు: మండలంలోని ఉల్లగల్లులో గురువారం ఫాగింగ్ చేశారు. దర్శి మలేరియా అధికారి నరావుల బసవారెడ్డి, వైద్యాధికారి జాస్మిన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. గ్రామంలో పలువురికి జ్వరాలు ఉన్నట్లు తెలుసుకుని సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నివారణకు ద్రావణాన్ని పిచికారీ చేసి ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచి జేఎస్ పిచ్చయ్య, సెక్రటరీ శ్రీనివాసరావు, మాజీ సర్పంచి గొంది వెంకటప్పారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అన్నపురెడ్డి భిక్షాల్‌రెడ్డి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా దుర్గాప్రసాద్


దుర్గాప్రసాద్

మార్కాపురం: మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసరావుపేట నుంచి బదిలీపై మార్కాపురానికి రాగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన దేవదత్తును ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలు, జూద శిబిరాల నిర్వహణపై దృష్టిసారించి కట్టడి చేస్తానని చెప్పారు. ఆయనను సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి అభినందించారు.

పంటలను బెట్ట నుంచి కాపాడుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): పంటలను బెట్ట పరిస్థితుల నుంచి కాపాడుకునేందుకు పాటించాల్సిన విధానాన్ని వ్యవసాయాధికారి ప్రసాదరావు వివరించారు. తాళ్లూరులో పలు పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

త్రిపురాంతకం: దళిత ఉద్యోగుల క్యాలెండ్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. త్రిపురాంతకంలో జరిగిన దళిత ఎంప్లాయిస్ ఏపీ మేడ్ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా దళిత ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ఉద్యోగుల హక్కులు సాధించుకోవాలన్నారు. ప్రజలకు సేవలందించడంలో ముందున్నామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తహసీల్దార్ వి.కిరణ్, మేడ్ నాయకుల సామ్యూల్ జాన్, జయకర్, శామ్యూల్, పేతురు, మోజెస్ పాల్గొన్నారు.

గిద్దలూరు సీఐగా దాసరి ప్రసాద్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు సీఐగా దాసరి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న దేవప్రభాకర్ గుంటూరు లాలాపేటకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో దాసరి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ సుబ్బారావు

త్రిపురాంతకం: త్రిపురాంతకం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. సుబ్బారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. త్రిపురాంతకం పోలీస్ సర్కిల్‌లో ఇప్పటి వరకు సీఐగా ఉన్న పాపారావు తిరుపతి జిల్లా గూడూరు-1 పట్టణ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

రక్తహీనత నివారణకు మాత్రల పంపిణీ

వెలుగువారిపాలెం (ముండ్లమూరు): విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి ఆరోగ్యవంత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతి గురువారం విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు అందిస్తోందని ప్రధానోపాధ్యాయుడు పోలంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల (ఏఏ)లో గురువారం విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. ఆశ కార్యకర్త అంజమ్మ పాల్గొన్నారు.

4న తాళ్లూరు సర్వసభ్య సమావేశం

తాళ్లూరు (ముండ్లమూరు): ఈ నెల 4న తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేవై కీర్తి తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు. పలు శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఎంపీడీఓగా సీతారామయ్య

కురిచేడు: మండల నూతన ఎంపీడీఓగా పి.సీతారామయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నుంచి మండలానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. కులగణన త్వరితగతిన పూర్తిచేయాలని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కార్యదర్శులు దగ్గరుండి చూసుకోవాలన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.


కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ సీతారామయ్య

71 మంది కుష్టురోగుల గుర్తింపు

కురిచేడు: గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు నియోజకవర్గంలో ఇంటింటి సర్వే నిర్వహించి 71 మంది కుష్టురోగులను గుర్తించినట్లు డీపీఎంఓ ఎన్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో డిసెంబరు 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు గుర్తించిన కేసులను గురువారం పరిశీలించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని పొట్లపాడు, గంగదొనకొండ, పడమర గంగవరం, ఎన్ఎస్‌పీ అగ్రహారం, బోధనంపాడు గ్రామాల్లో ఇంకా అనుమానంగా ఉన్న వారిని పరీక్షించారు. జిల్లాలో కొత్తగా నమోదైన కేసుల్లో దర్శి నియోజకవర్గంలో 60 శాతం కొత్త కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎటువంటి అనుమానం ఉన్నా డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎన్‌వీ సుబ్బారెడ్డి 94402 66251 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.


అనుమానిత రోగులను పరీక్షిస్తున్న డీపీఎంఓ సుబ్బారెడ్డి